

అక్కుపల్లి గోకవరంలో మలేరియా

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని అక్కుపల్లిగోకవరంలో మలేరియా కేసు వెలుగులోకి వచ్చింది. దీంతో చేబ్రోలు పిహెచ్‌సి సిబ్బంది గురువారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఒకరు మేస్త్రీ పనులకు రంపచోడవరం ప్రాంతంలోని ఏజెన్సీకి వెళ్లి ఇటీవల సొంతూరు వచ్చారు. రంపచోడవరం,ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి సొంతూరు వచ్చారు. ఆయనకు జ్వరం రావడంతో పరీక్షలు చేయగా మలేరియాగా గుర్తించారు. మలేరియా సోకిన వ్యక్తి ఇంటి చుట్టుపక్కల 50 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించామని, ఫలితాలు రావాల్సి ఉందని పిహెచ్‌సి వైద్యాధికారి కెవిఎస్.వర్మ వెల్లడించారు. గ్రామంలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌సిల గెలుపు బాధ్యత ఎంఎల్‌ఎలపై..!

స్థానిక ప్రతినిధుల్లో అసంతృప్తులపై వైసిపి అధిష్టానం అప్రమత్తం

నియోజకవర్గం, డివిజన్లవారీ క్యాంపుల నిర్వహణకు సమాయత్తం

టిడిపి వ్యూహాలతో అధికారపక్ష ఎంఎల్‌ఎలకు ముచ్చెమటలు



ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

'స్థానిక సంస్థల్లో మూడింట రెండొంతులకుపైగా మనవాళ్లే ఉన్నారు.. ఇక ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ పడే సాహసం ఎవరు చేస్తారులే అని అధికారపక్షం భావించింది. స్వతంత్ర అభ్యర్థులను సైతం సామ, దాన, బేధ, దండోపాయాలు ప్రయోగించి పోటీ నుంచి తప్పించొచ్చని తలచింది. అయితే నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసే వరకూ ఉన్న ఆ ధీమా ఉపసంహరణ పర్వం ముగిసే ముందు రోజు నుంచి పూర్తిగా సడలిపోయింది. స్వతంత్ర అభ్యర్థులుగా నలుగురు టిడిపి వ్యూహం ప్రకారమే బరిలో ఉండటం, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసే వరకూ వారు అందుబాటులో లేకుండాపోవడం, అందుబాటులో ఉన్నా వైసిపి నేతల ఒత్తిడికి తలొగ్గకపోవడంతో సీన్ రివర్స్ అయ్యింది. ఇదే సమయంలో మరికొన్ని సమస్యలు వైసిపి అభ్యర్థులను, నేతలను చుట్టుముట్టాయి. ప్రధానంగా స్థానిక సంస్థల నిధుల మళ్లింపు, వాలంటీర్ల వ్యవస్థతో వారికి పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం తదితర అంశాలపై ఇప్పటికే తీవ్ర అసంతృప్తి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో పెద్దఎత్తున నెలకొంది. చివరకు అధికారులు సైతం తమ మాట వినడం లేదనే భావన అధికార పార్టీ ప్రజాప్రతినిధుల్లో ఎక్కువగా ఉంది. దీనికి నిదర్శనం సాక్షాత్తూ జెడ్‌పి సమావేశంలోనే అధికార పార్టీకి చెందిన నరసాపురం జెడ్‌పిటిసి తాను అడిగిన పనులకు నిధులివ్వాలని జెడ్‌పి ఛైర్మన్ చెప్పినా జెడ్‌పి సిఇఒ నిధులు మంజూరు చేయడం లేదని అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేయడమే. దీంతో ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ పరిస్థితిని వైసిపి పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎంఎల్‌సి ఎన్నికల ఓటింగ్ పద్ధతి వేరేగా ఉండటం, ప్రథమ ప్రాధాన్యత ఓటుతోపాటు రెండో ప్రాధాన్యతా ఓటు కోసం టిడిపి నేతలు పకడ్బందీగా ముందుకెళ్తున్నట్లు సమాచారం ఉండటంతో ఇప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక ఎంఎల్‌సి స్థానం కచ్చితంగా కోల్పోవాల్సి వస్తుందని అధిష్టానం వద్ద స్పష్టం చేసినట్లు సమాచారం. అదే సమయంలో డెల్టా ప్రాంతంలో కొంత అసంతృప్తులను బుజ్జగించి దారిలోకి తెచ్చే అవకాశం ఉన్నా మెట్ట ప్రాంతంలో పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఏలూరు నగర పాలక సంస్థలో విబేధాలు, చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ, ఎంపీల గ్రూపు తగాదాలతోపాటు ఏలూరు జిల్లా ప్రాంతానికి మంత్రి పదవులు లేకపోవడం, ఎంఎల్‌సిగా ఒక్కరికీ ఈ ప్రాంతం నుంచి అవకాశం కల్పించకపోవడం తదితర పరిణామాలు తమ గెలుపు నల్లేరు మీద నడక కాదని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అధికారపక్షానికి స్థానిక సంస్థల్లో మంచి మెజార్టీఉన్నా ఎంఎల్‌సి స్థానం ఒకటి కోల్పోయే ప్రమాదం ఉందనే సమాచారంతో అధిష్టానం సైతం ఒకింత అప్రమత్తమైనట్లు సమాచారం. మండలస్థాయిలో జెడ్‌పిటిసి, ఎంపిపితోపాటు మరో ముఖ్యనేతతో త్రిసభ్య కమిటీ తరహాలో ఏర్పాటు చేసి ఆయా నియోజకవర్గాల ఎంఎల్‌ఎలకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. తద్వారా అధికార పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓట్లు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే ఓటింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందుగానే వివరించాలని భావిస్తున్నట్లు సమాచారం. రెండు, మూడో ప్రాధాన్యత ఓట్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించడంతోపాటు పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఆయా క్యాంపుల్లోనే నమూనా పోలింగ్ నిర్వహించి లోపాలను సరిదిద్దడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో క్యాంపు రాజకీయాలను నియోజకవర్గాలవారీ నిర్వహించాలని, చివరి రెండు రోజులు డివిజన్‌స్థాయిలోకి మార్చి పోలింగ్ కేంద్రానికి నేరుగా తమ ఓటర్లను తీసుకురావాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న అసంతృప్తి, తగాదాలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా ఎంఎల్‌ఎల భుజస్కంధాలపై ఉంచాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ నేత ఒకరు తెలిపారు. అదే సమయంలో రాజమండ్రి జిల్లాలో విలీనమైన కొవ్వూరు రెవెన్యూ డివిజన్ మండలాల్లో ఓటింగ్ బాధ్యత హోం శాఖ మంత్రి తానేటి వనిత పర్యవేక్షించినా ఏలూరు జిల్లాలో బాధ్యత మాత్రం రాష్ట్రస్థాయి సీనియర్ నేతకు అప్పగించాలని అభ్యర్థులు ఇరువురు అధిష్టానానికి విన్నవించినట్లు సమాచారం. మొత్తానికి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్న తెలుగు తమ్ముళ్లు వైసిపి నేతల్లో గుబులు పుట్టిస్తున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలు ఎలాగున్నా అన్నిరకాలుగా బలం కలిగి ఉన్నా అధికారపక్షంలో కలవరం సృష్టించడం ప్రతిపక్షాల విజయంగానే చెప్పుకోవచ్చు. ఏదేమైనా వచ్చే సంవత్సరం సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎంఎల్‌సి ఎన్నికలు అధికార పార్టీ ఎంఎల్‌ఎలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయడంలో ఎటువంటి సందేహమూ లేదు. పోలింగ్ సమీపించేసరికి ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచిచూడాలి.



ఏలూరులో..

గ్యాస్ ధర తగ్గించాల్సిందే

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ గ్యాస్ సిలెండర్ మోస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఏలూరులో గురువారం వినూత్న నిరసన తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ గ్యాస్ సిలెండర్లను నెత్తిన పెట్టుకుని బండ భారం మోయలేక పోతున్నాం బాబోయ్.. తగ్గించండి అంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలెండర్ ధర రూ.50, వాణిజ్య సిలెండర్ ధర రూ.350 పెంచడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే నాటికి గ్యాస్ సిలెండర్ ధర రూ.400 ఉంటే నేడు అది రూ.1155కు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్ ఛార్జీలూ ఇలానే పెంచారన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు వేస్తూ బిజెపి ప్రభుత్వం కాకులను కొట్టి గెద్దలకు పెట్టిన చందంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తవ్వగానే గ్యాస్ ధర పెంచిందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పివి.రామకృష్ణ, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, వివివివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు, మావూరి శ్రీనివాసరావు, కొర్రి విజయలక్ష్మి, జి.శారద, పి.రవికుమార్, ఎం.ఇస్సాక్, జి.యేసుబాబు, జి.కోటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన

గ్యాస్ ధర విపరీతంగా పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం ఏలూరులో ర్యాలీ, ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గ్యాస్ బండతో ప్రదర్శన నిర్వహించారు. ఫైరాఫీస్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు (యువి), జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు, యర్రా శ్రీనివాసరావు, డి.వీరినాయుడు, మంగం అప్పారావు, ఐఎఫ్‌టియు నాయకులు గడసాల రమణ, మేకల రామయ్య, రంగాల అప్పారావు, ఎస్.నాగేశ్వరరావు, కారణం శ్రీను, రాచీటి జాన్, ప్రసాద్, రామ్మూర్తి నాయుడు, కోరాడ అప్పారావు, బాపూజీ, దన్నాన విజయ్ పాల్గొన్నారు.

పెదపాడు: గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బండ్ల తూము సెంటర్‌లో గురువారం నిరసన చేపట్టారు. గ్యాస్ సిలిండర్లను రోడ్డుపై పెట్టి పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగం కృష్ణారావు, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, పిట్టా రాహుయేలు, రెడ్డి లక్ష్మణరావు, ముసునూరి కొండలరావు, షేక్ భాషా, షేక్ అహ్మదుల్లా పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం: పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఎ.పోలవరంలో ఆందోళన నిర్వహించారు. యాగంటి సీత అధ్యక్షతన జరిగిన నిరసనలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. ఓపక్క నిత్యావసరాల ధరలు పెరిగి సతమతమవుతుంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా గ్యాస్ ధర పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు జి.సూర్యకిరణ్, బత్తుల వెంకన్న, టి.సోమాలమ్మ, డి.వెంకటేశ్వరరావు, పి.సూరయ్య, ఆర్.సత్యవతి, కె.రాములమ్మ, జ్వాలా వెంకటేష్, ఎ.కుమారి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సిపిఎం ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం రోడ్లో సుబ్రమణ్యం గుడి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి.ధనరాజు, ఎస్.శివకుమార్, కె.సీతారాములు, సిహెచ్.మరిడియ్య, సిహెచ్.సత్యనారాయణ, అడపా నాని, పిల్లా తామారావు, కె.దుర్గారావు, జి.గోపీ, మిద్దె వెంకటేష్, ముప్పిడి సురేష్, టెక్కెం నాగు, రాసూరు దుర్గారావు, వంకాయ దుర్గారావు, వీర్రాజు, బి.రమేష్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం నేత సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నాడు ఆగిరిపల్లి పెద్ద కొఠాయి సెంటర్ వద్ద గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావుతోపాటు రాజులపాటి చంటి మాట్లాడగా నేతలు షేక్ జహాంగీర్ భాషా, బండ కోటేశ్వరరావు, ఢిల్లీ నాగరాజు, నల్లమోతు రమేష్, పలువురు మహిళలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..



మాట్లాడుతున్న వాసుబాబు

వైసిపి గెలుపునకు కృషి చేయాలి : వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేలా అందరకూ కృషి చేయాలని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పిలుపునిచ్చారు. మండలంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో గురువారం గోపీనాథపట్నం కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని, సెల్‌ఫోన్లకు ముఖ్యమంత్రి స్టిక్కర్లు అంటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపీనాథపట్నం సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు పి.విష్ణుమూర్తి, పార్టీ మండల కన్వీనర్ మరడ వెంకటమంగారావు, ఉంగుటూరు -1 ఎంపిటిసి డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కె.జయలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ పాపారావుబాబ్జీ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఆదివారమే సెలవు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆదివారమే సెలవు ఇవ్వాలని దాన్ని మార్చకూడదని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) నాయకులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిని అందించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డిఇ

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి

ప్రజాశక్తి - మండవల్లి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ డిఇ రమణమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి ఆధ్వర్యంలో గురువారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన, ప్రోత్సాహక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ జాన్సీ, ఎంపిటిసి గూడపాటి జాన్సీ, హౌసింగ్ ఎఇ శేఖర్ పాల్గొన్నారు.

సిపిఐ నేతల నిర్బంధాన్ని నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

టిడ్కో ఇళ్లను పేదలకు అప్పగించాలని, జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు అందిస్తున్న రుణం పెంచాలని కోరుతూ విజయవాడలో జరుగుతున్న మహాధర్నాకు వెళ్తున్న సిపిఐ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం దారుణమని పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు పుల్లూరి సోమశేఖర్, తోర్లపాటి బాబు అన్నారు. ఈ సందర్భంగా చింతలపూడి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోడ వజ్రం, దంతా కృష్ణ, ఎస్‌కె.జానీ, వెంకటేశ్వరావు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి తుర్లపాటి రాజు, మాధవరావు పాల్గొన్నారు.

పడకేసిన 'చింతలపూడి' అభివృద్ధి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధి పూర్తిగా పడకేసిందని సిపిఎం పట్టణ నాయకులు ఎస్.సూర్యకుమార్, కె.అనురాధ విమర్శించారు. ఈ మేరకు గురువారం వారొక ప్రకటన విడుదల చేశారు. నగరంలో కనీసం వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదన్నారు. పన్నులు సకాలంలో చెల్లించకపోతే హడావుడి చేసే అధికారులు ప్రజల అవసరాలు తీర్చడంలో మాత్రం ఆ తొందర కనిపించడం లేదని పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా పట్టణ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు.

9 నుంచి ఆందోళన విజయవంతం చేయాలి

ఎపి జెఎసి అమరావతి నేతల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



ఉద్యమ కార్యాచరణపై ఉద్యోగులకు వివరిస్తున్నరాష్ట్ర నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9 నుంచి చేపట్టనున్న ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదర్‌రావు కోరారు. గురువారం ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని ఉద్యమ కార్యాచరణ విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఛైర్మన్ కె.రమేష్, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లా ఛైర్మన్ ఎస్.శివశంకర్, ప్రధాన కార్యదర్శి కె.ఫణికుమార్ మాట్లాడుతూ జెఎసి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను జిల్లాలో విజయవంతం చేస్తామన్నారు.

అనంతరం రాష్ట్ర నేతలు ఇరువురు ఏలూరు కలెక్టరేట్, ట్రెజరీ, కోఆపరేటివ్, డిఆర్‌డిఎ, ఎపిజిఎల్‌ఐ, సివిల్ సప్లయీస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు, ఆర్‌డిఒ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తదితర జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను నేతలకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్.మల్లేశ్వరరావు, ఎ.సాంబశివరావు, జిల్లా నేతలు పాల్గొన్నారు.

ఓటును గోప్యంగా వినియోగించుకోవాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

ఓటర్లు తమ ఓటుహక్కును గోప్యతతో వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సిబ్బందికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై సిబ్బంది పూర్తి స్థాయిలో శిక్షణ పొంది ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ ముందు రోజే మెటీరియల్‌ను ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బంది తీసుకుని పోలింగ్ స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు అన్నీ సక్రమంగా ఉన్నాయో, లేదో చూసుకోవాలని, పోలింగ్ కేంద్రంలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రదర్శించాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను ముందుగానే పరిశీలించుకోవాలని, వెబ్ కాస్టింగ్‌లో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ అనంతరం పోలైన బ్యాలెట్ బాక్స్‌లను వాటిని భద్రపరిచే కేంద్రాలకు తరలించి అక్కడ సిబ్బందికి అందించే వరకు పోలింగ్ సిబ్బందిదే బాధ్యతని అరుణ్‌బాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఆర్‌డిఒలు పెంచల్‌కిశోర్, ఝాన్సీరాణి, డిఎస్.రాజు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుడు మామిళ్లపల్లి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రముఖ కళాకారుడు మామిడిపల్లి సుబ్బారావు మృతి కళారంగానికి తీరని లోటని ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ అన్నారు. బొర్రంపాలెంలో సుబ్బారావు సంతాప సభ గురువారం నిర్వహించారు. ముందుగా మామిళ్లపల్లి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు ఎంతో ఓపికతో, నేర్పుతో కళాకారుడిగా రాణించారన్నారు. జానపద కళలను బతికించాలనే తపనతో వందలాది భజన బృందాలను, బుర్రకథ బృందాలను తయారు చేసిన ఘనత మామిళ్లపల్లికి దక్కుతుందన్నారు.

గుంటూరు, మాచర్ల, గురుజివోలు, ద్వారకాతిరుమల, తిమ్మాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు మామిళ్లపల్లికి నివాళులర్పిస్తూ గానాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బచ్చు నందకుమార్, ఎల్ఆర్.కృష్ణబాబు, తిప్పర్తి వీరబ్రహ్మాచారి, షేక్ సుభాని, ఎడవల్లి కనకారావు, వీరమల్ల మధు, ఆచంట రాము, వెంకట్రావు, అంజయ్య, అనసూయమ్మ పాల్గొన్నారు.

పంట కాలువల్లో తగ్గుతున్న నీటిమట్టం

ప్రజాశక్తి - భీమడోలు



కాలువల పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ అధికారులు

వేసవి ఆరంభంలో గుండుగొలను ఇరిగేషన్ పరిధిలోని పంటకాలువల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టేందకు సన్నద్ధమవుతున్నారు. నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఆయా మండలాల రెవెన్యూ, మండల స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. గురువారం గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలోని ఏలూరు కాలువ ద్వారా అందుతున్న నీటి లభ్యతపై స్థానిక ఇరిగేషన్ అధికారులు, రైతులు ప్రజాప్రతినిధులతో వారు మాట్లాడారు. గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో ఇప్పటికే సాగునీరు అందక కొవ్వలి, పోతునూరు గ్రామాల పరిధిలోని వంద ఎకరాల విస్తీర్ణంలో పంటలకు నీరందని పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నారు. స్పెషల్ గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో 20 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరుగుతుంది. దీంతో పాటు అధికారిక, అనధికారికంగా 15 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగవుతోంది. వీటన్నింటికీ గోదావరి కాలువ ద్వారా వచ్చే నీరు మాత్రమే ఆధారం. ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో రెండు విడతలుగా తొలివిడతగా భీమడోలు మండలం, రెండో విడతగా దెందులూరు, ఏలూరు రూరల్ ప్రాంతాలకు వంతులవారీ విధానంలో నీరు అందజేస్తున్నారు. ఏలూరు కాలువకు 698 క్యూసెక్కులు నీరు విడుదల చేయాల్సి ఉంది. అయితే ఆ పరిమాణం తగ్గింది. దీంతో గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాలువకు 300 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉండగా, 200 క్యూసెక్కులు మాత్రమే నీరు అందుబాటులో ఉంది. ఇక్కడ నీటిమట్టం 5.50 అడుగులు కొనసాగాల్సి ఉండగా నాలుగు అడుగులు, కైకరం వద్ద ఐదు అడుగుల నీటి మట్టం ఉంది. దెందులూరు ప్రాంతంలో నీటిమట్టం కేవలం అడుగున్నర మాత్రమే ఉంది. దీంతో ఏలూరు ప్రజలకు ఏలూరు కాలువ ద్వారా అందాల్సిన 20 క్యూసెక్కుల తాగునీటి లభ్యతపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు మాత్రం త్వరలో వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతుల అవసరాల కోసం పూర్తిస్థాయిలో నీరు అందుతుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కాలువకు నీటిలభ్యత తక్కువగా ఉండటంతో సాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయంగా డ్రెయినేజీ శాఖ గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలోని పది మురుగు కాలువలకు అడ్డుకట్టలు వేశారు. దీనిద్వారా రెండు వేల ఎకరాల సాగుకు నీరు అందుతుందని లెక్కలు కట్టారు. ఏలూరు కాలువ మరమ్మతుల విషయానికి వస్తే దీనికి సరిపడు నిధులు విడుదల కాలేదు. భీమడోలు-1ఎస్ కేప్ పూర్తిశిథిలావస్థకు చేరింది. ఆ ప్రాంతంలో నీటి లీకేజ్ ఎక్కువగా ఉండటం వల్ల కాలువ నీరు వృథాగా కొల్లేరులోకి పోతుంది. ఇక పంటలను కాపాడుకునేందుకు రైతులు నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికీ 20 వరకు ఆయిల్ ఇంజిన్లను కాలువ గట్టుపై పెట్టి నీరు తోడుకొంటూ పంటలను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక గోదావరిలో ఆశించిన మేర నీటిలభ్యత లేనందు వల్ల సీలేరు నుంచి నాలుగు వేల క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు దాన్ని గురువారం నుంచి 3700 క్యూసెక్కులకు కుదించారు. ఈ విషయాలపై ఇరిగేషన్ శాఖ సహాయ ఇంజనీర్ మాధవరావును వివరణకోరగా ఏలూరు కాలువ ద్వారా నీటిలభ్యత అంశాన్ని ఉన్నతస్థాయి అధికారులు గురువారం పరిశీలించారన్నారు. పంటలను కాపాడేందుకు ఏలూరు కాలువకు అదనంగా నీటి విడుదలకు గల అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డిఇఇ సత్యేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్‌ఎంపిపి రాజానాయన

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కనీసం ఫోన్ చేసినా సరైన సమాచారం ఇవ్వడం లేదని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, ఎంపిడిఒ జి.రాణీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులను కలుపుకుని అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, వాలంటీర్లకు కనీసం మూడు రోజులు హాజరుండాలన్నారు. వ్యవసాయశాఖ ఎఒ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు 40 శాతం సబ్సిడీపై ఇస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని వైస్‌ఎంపిపి కోరారు. అనంతరం నూజివీడు హౌసింగ్ డిఇ సువర్ణరాజు, ఉపాధి హామీ ఎపిఒ ప్రసాద్, తహశీల్దార్ దాసరి సుధ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.




కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

ఇండియన్ బ్యాంక్ సిఎస్‌పి సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ఇండియన్ బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి పెరుమాళ్ల పద్మ అన్నారు. పెరికేగూడెంలో బ్యాంక్ మిత్ర సర్వీస్ పాయింట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మండవల్లి బ్రాంచి మేనేజర్ దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లోని సామాన్య ప్రజలకు అందుబాటులో లేని వివిధ బ్యాంకు సేవలను కస్టమర్లకు అందించడానికి ఈ పాయింట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బ్యాంకు మిత్ర అంటేనే బ్యాంకులో ప్రతినిధులన్నారు. సెలవు రోజుల్లోనూ బ్యాంకు మిత్ర వద్ద నుండి ఖాతాదారులు తమ ఖాతా నుండి రూ.20 వేల వరకూ జమ లావాదేవీలు చేయొచ్చన్నారు. అన్ని బ్యాంకుల ఖాతాదారులు నగదు తీసుకోవచ్చని చెప్పారు. గన్నవరం, భైరవపట్నం, అయ్యవారి రుద్రవరం, ఆనందపురం గ్రామాల్లో బ్యాంకుమిత్ర పాయింట్లు ఏర్పాటు చేసి బ్యాంక్ లావాదేవీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అనిల్‌కుమార్, తిరుమల సత్యనారాయణ, శివ, నందకిషోర్, సత్యవతి, విజయలక్ష్మి, సామ్రాజ్యం, రాజేశ్వరి, వరలక్ష్మి, రమేష్, రత్నకుమారి, వెంకటరమణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానంపై అపోహలు వీడండి


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రక్తదానంపై అపోహలు వీడి అందరూ ముందుకురావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మణీంద్రరావు అన్నారు. ఏలూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణీంద్రరావు మాట్లాడుతూ రక్తం దానం చేయడం వల్ల ఎంతోమందిని ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. రక్తదానంతో కొత్తరక్తం వృద్ధి చెందుతుందని, చురుగ్గా ఉంటారని విద్యార్థులకు సూచించారు. దీనిపై అపోహలు వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మద్రి వెంకటేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది రక్తదానం చేశారు.

ఘనంగా కొల్లేరు పెద్దింటి అమ్మవారి జాతర

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేటికోటలోని శ్రీపెద్దింటి అమ్మవారి జాతర పదో రోజు గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి పుష్యాహవచనం, శ్రీవిఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, దీక్షధారణ, అంకురారోపణ, నవగ్రహ కళాశార్చన, వాస్తుపూజ, వాస్తుబలి, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణ వంటి పూజలు చేశారు. అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేసి అమ్మవార్లను దర్శించి, పాల పొంగళ్లు సమర్పించి, మొక్కు బడులను చెల్లించుకున్నారు. ఆలయ ఇఒ కెవి.గోపాలరావు యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు.


వీల్‌చైర్ అందజేస్తున్న ఎంపిపి

అర్హులకు పథకాలు అందేలా కృషి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి వికలాంగునికీ అందేలా కృషి చేస్తామని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లిలోని భవిత కేంద్రం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో వికలాంగునికి ఎంపిపి వీల్‌చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, నాయకులు కె.విష్ణువర్ధన్, ఎంఇఒ రామారావు, సాయి, డివి సతీష్, ఐఆర్‌టి కోటేశ్వరరావు, మద్దిరావడ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తక్కువ ధరకు సిమెంట్, ఐరన్ ఇప్పిస్తానని మోసం

ప్రజాశక్తి - టి.నరసాపురం

తక్కువ ధరకు ఐరన్, సిమెంట్ ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వ్యక్తి ఉదంతం మండలంలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏపిగుంట గ్రామానికి చెందిన కొండపల్లి మధుబాబు తనకు సిమెంట్, ఐరన్ కంపెనీలో డీలర్‌షిప్ ఉందని, కొత్తగా ఇల్లు నిర్మాణం చేసుకుంటున్న వారి వద్దకు వెళ్లి తక్కువ రేటుకే సిమెంట్, ఐరన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి డబ్బు తీసుకున్నాడు. ఈ క్రమంలో చింతలపూడి మండలం బట్టువారిగూడెం గ్రామానికి చెందిన అమ్మనబోలు సుధాకర స్వామి అలియాస్ శివశక్తి వద్ద రూ.13 లక్షలు, ముత్యాలమ్మపేటకు చెందిన వేముల సాయి వద్ద రూ.ఐదు లక్షలు వసూలు చేశాడు. అంతేకాక మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో కూడా వాగ్దానంలోని మోసం చేసి డబ్బు తీసుకున్నాడు. ఎంతకీ ఐరన్, సిమెంట్ ఇవ్వకపోవడంతో మోసపోయామని భావించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - దెందులూరు

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతిచెందిన సంఘటన దెందులూరులో జరిగింది. దెందులూరు ఎస్ఐ ఇజ్జపు వీర్రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దెందులూరుకు చెందిన గొరికల శామ్యూల్(22) ఏలూరు సమీపంలోని దుగ్గిరాల కళాశాలలో బిఎస్‌సి నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 28వ తేదీన కళాశాలకు వెళ్లిన శామ్యూల్ తిరిగి రాలేదు. ఆదేరోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి గొరికల ఎడ్వర్డ్ ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో అనూహ్యంగా బుధవారం శ్యామ్యూల్ ప్రకాశం జిల్లా ఒంగులూరు ప్రాంతంలో రైలు పట్టాల పక్కన మృతిచెంది పడివున్నాడు. దీంతో ఒంగోలు రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు. ప్రేమ వ్యవహారం కూడా శ్యామ్యూల్ మృతికి కారణం అయిఉండొచ్చన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన శామ్యూల్

ఆడ పిల్లలను సంరక్షించాలి

జిల్లాలో పలుచోట్ల 'బేటీ బచావో.. బేటీ పడావో'

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బేటీ బచావో.. బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి.. ఆడపిల్లలకు చదువు చెప్పండి) అనేది దేశంలోని బాలికల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.ఆశ తెలిపారు. గురువారం స్థానిక కస్తూరిభా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఆశ మాట్లాడారు. ఆడపిల్లల మనుగడ, భద్రతను నిర్ధారించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాలికల విద్యాభ్యాసానికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, వీటిపై స్కానింగ్ సెంటర్లలో ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.మానస మాట్లాడుతూ ఈ పథకం బాలికలకు ఒక వరం వంటిదన్నారు. ఈ పథకంపై బాలికలు అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులకు పథకం ప్రయోజనాలను వివరించి సుకన్య సమృద్ధి ఖాతా తెరిపించాలని చెప్పారు. ఈ పథకం బాలికల చదువుకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ సూర్యచక్రవేణి, సిడిపిఒ పద్మావతి, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ భార్గవి, స్కూలు ఇన్‌ఛార్జి కృష్ణమోహన్, నాగరత్నం, హెల్త్ ఎడ్యుకేషన్ విజయ్ కుమార్, పాఠశాల బాలబాలికలు పాల్గొన్నారు.



ఏలూరులో..

గణపవరం: ఆడ పిల్లలకు ప్రతిఒక్కరూ రక్షణగా ఉండాలని గణపవరం ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు కుటుంబానికి బరువు అనుకునే రోజులు పోయాయన్నారు. ప్రస్తుతం ఆడపిల్లలే దేశాధినేతలుగా రాజ్యాలు ఏలుతున్నారని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో ఆడపిల్లను రక్షించు.. చదివించు అంటూ గణపవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ విల్సన్‌రాజు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



గణపవరంలో..

పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కాశిపాడు హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం బి.కాంతిశ్రీ, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్ఎం శివకుమారి, ఆశాలు వరలక్ష్మి, కృష్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలపూడి : బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని భట్టువారిగూడెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.ప్రభాకర్ అన్నారు. భట్టువారిగూడెం సచివాలయ పరిధిలో గురువారం యర్రగుంటపల్లి పిహెచ్‌సి సిబ్బంది ఆడపిల్లల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువుతోనే వెనుకబాటుతనం ఉండదన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, భ్రూణహత్యలు అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జివి.రమణ, ప్రభాకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది సయ్యద్ జఫ్రుల్లా, ఎం.మంగతాయారు, అరుణ, దేవమాత, ఆశావర్కర్లు ప్రభ, సామ్రాజ్యం, పార్వతి, మేరీ, నిర్మల, వాలంటీర్ ప్రియాంక పాల్గొన్నారు.

ఏసుబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి - మండవల్లి

కుటుంబ ఆధారం కోల్పోతే ఆ బాధ ఎవరూ తీర్చలేనిదని కైకలూరు మాజీ శాసనసభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు. మణుగూరులో గురువారం నిర్వహించిన పొట్ల ఏసుబాబు సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏసుబాబు మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయన్నారు. ఆ కుటుంబానికి తీరనిలోటు అని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యపరాజు గుర్రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా తయారీదారులపైన, విక్రయించినవారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఇబి అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు అన్నారు. పట్టణంలో ఎస్ఇబి స్టేషన్ వద్ద వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న 382 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా అమ్మినా, తయారు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ సాయిస్వరూప్ పాల్గొన్నారు.

క్రీస్తుబోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - కైకలూరు

క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. తామరకొల్లులో బేతేలు ప్రార్థనా మందిరం ఎదురుగా జరుగుతున్న క్రైస్తవ ఉజ్జీవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్ ఏసురత్నం, పద్మలత శామ్యూల్, కె.రతన్ శామ్యూల్, డేనియల్ రాజు, దానియల్ నికోలస్, వేదరత్నం, జాన్ వెస్లీ, విశ్వాసులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

నాడు - నేడు పథకంలో చేపట్టిన పాఠశాల తరగతి గదులు నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. పోలసానిపల్లి ఎంపిపి పాఠశాల-1.ను ఆయన గురువారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, జగనన్న విద్యా కానుక పంపిణీ ఇతర అంశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.తులసి, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఇళ్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నాగేశ్వరరావు

జగనన్న ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి - కైకలూరు

జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు లబ్ధిదారులను కోరారు. గురువారం కైకలూరులోని ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్త హోమ్స్ ఎమ్‌డి నారాయణరెడ్డి, మండవల్లి ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సిఎం కావాలని పూజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా కావాలని కోరుతూ మండలంలోని కాకరవాడ మాజీ సర్పంచి బేతపూడి వెంకటరమణ, తన సోదరులు కలిసి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మైలవరం మండలం బూరాయిగూడెంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్ మళ్లీ సిఎం కావాలని, కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మరోమారు ఎంఎల్ఎగా అఖండ మెజారిటీతో గెలిచి మంత్రి పదవిని చేపట్టాని కోరుతూ పూజలు చేసినట్లు వెంకటరమణ తెలిపారు. మళ్ళీ జగన్ పాలన వస్తేనే దళితులకు, బిసిలు, మైనార్టీలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనలో అన్ని తరగతుల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణతో పాటు ఆయన సోదరులు బేతపూడి శ్రీనివాసరావు, బేతపూడి వెంకటనాగరాజు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంతతి

కానుకొల్లులో లేగదూడల పోటీలు

ప్రజాశక్తి - మండవల్లి

కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పశుసంతతి అభివృద్ధి చెంది రైతులు ఆర్థికవృద్ధి సాధించవచ్చని సర్పంచి నాగదాసి థామస్ అన్నారు. గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ ఆర్థిక సహాయంతో కానుకొల్లులో నిర్వహించిన లేగ దూడల ప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశు వైద్యశాల వద్ద లేగ దూడల ప్రదర్శన అభినందనీయమన్నారు. ఈ ప్రదర్శన పశుపోషకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మేలు జాతి దూడలను పోషించే రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ ప్రదర్శనలో 15 ఆవు దూడలు, 18 గేదె దూడలతోపాటు 52 మంది రైతులు పాల్గొన్నారు. మేలు జాతి పశువులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పోషణపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనలో కందుల శివ నాగ ప్రసాద్‌కు చెందిన ఆవు దూడ మొదటి బహుమతి, సాయిన నాగరాజుకు చెందిన గేదె దూడ రెండో బహుమతి, జన్ను వీరబాబు ఆవు దూడ మూడో బహుమతి గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు సర్పంచి నాగరాజ్ థామస్, లింగాల ఎంపిటిసి కమదన శేషతల్పరావు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, గన్నవరం డిఎల్‌డిఎ డాక్టర్ హరిత, మండవల్లి, కానుకొల్లు పశువుల వైద్యులు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


మొదటి బహుమతికి ఎంపికైన లేగదూడ

రైస్‌మిల్లు బెల్టులో చిక్కుకుని ముఠా కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక చోడిదిబ్బలోని శ్రీరామ రైస్ మిల్లు ముఠా కార్మికుడు కంపరం వెంకటసత్యనారాయణ(72) గురువారం ప్రమాదానికి గురయ్యాడు. మిల్లులో పనిచేస్తున్న సమయంలో మిషన్ బెల్టులో చిక్కుకుని కాలు, చేయి విరిగిపోయాయి. ఈ ఘటనకు సంబంంధించిన వివరాలిలా ఉన్నాయి. చోడిదిబ్బకు చెందిన వెంకటసత్యనారాయణ దీర్ఘకాలంగా మిల్లులో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే ఉదయం మిల్లులో పనికి వెళ్లిన ఆయన ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానిక ఆయన్ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రమాదానికి కారణమైన రైస్ మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

యాజమాన్యం న్యాయం చేయాలి : సిఐటియు

బి.సోమయ్య డిమాండ్ చేశారు. వెంకట సత్యనారాయణ పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ ప్రమాదానికి రైస్ మిల్లు యజమానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. 72 సంవత్సరాల వయసు గల అతనితో మిల్లు యజమాని పని చేయించుకోవడం దుర్మార్గమన్నారు. ఆయనకు అన్నిరకాల వైద్య సేవలు అందించాలని, ఖర్చులన్నీ మిల్లు యజమానే భరించాలని ఆయన కోరారు. కార్మిక శాఖ అధికారులు, ఫ్యాక్టరీస్ శాఖ అధికారులు తక్షణం ఈ ప్రమాదంపై తనిఖీలు నిర్వహించి, నిర్లక్ష్యంగానూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన యజమానిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సోమయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి రైస్ మిల్లుకు, ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితుణ్ని పరామర్శించారు.

గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్లు, పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక బాలల గ్రంథాలయానికి ఇన్నర్ వీల్ క్లబ్ సౌజన్యంతో రెండు సీలింగ్ ఫ్యాన్లు గురువారం అందజేశారు. వీటిని క్లబ్ సభ్యులు పిపి.వాసవి అందించారు. అలాగే విద్యార్థులకు వెయ్యిరూపాయల విలువైన కాంపిటేటివ్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ గంగాభవాని, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గుడిమెట్ల అచ్యుత, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - భీమడోలు

సాగులో మేలైన యాజమాన్య పద్ధతుల అవలంభించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏలూరు ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ నాగేంద్ర తెలిపారు. వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి ఆధ్వర్యంలో 250 ఎకరాలు విస్తీర్ణంలో నిర్వహిస్తున్న పొలంబడి (క్లస్టర్) కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఐదు రకాల చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులు గురించి శాస్త్రవేత్తలు వివరిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏలూరు సహాయ సంచాలకులు సుబ్బారావు పాల్గొన్నారు.


రైతులకు సాగులో మెళకువలు వివరిస్తున్న అధికారులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపిపి కనుమాల రామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి అత్యధిక సంఖ్యలో గృహప్రవేశాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను కోరారు. భీమడోలు సమగ్ర నీటి సరఫరా పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా జరుగుతుందని కొందరు సభ్యులు ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ సహాయ ఇంజనీర్ రామారావు నిధులు లేని కారణంగా కొంతమేరకు ఇబ్బంది ఏర్పడిందని సాధ్యమైనంత వరకూ సమస్యను పరిష్కరిస్తున్నామని వివరించారు. అనంతరం తహశీల్దార్ షంషుద్దీన్ మాట్లాడుతూ జూన్ నాటికి మండల పరిధిలో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాఘవన్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు డోకల వాసంతి, భీమడోలు మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రామయ్య

పర్మినెంట్ ప్రిన్సిపల్ పోస్టు మంజూరు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీఅరవింద జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పర్మినెంట్ ప్రిన్సిపల్ పోస్ట్ మంజూరైంది. ఈ పోస్ట్‌ను మంజూరు చేసిన కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌ను గురువారం మంగళగిరిలో కాలేజీ ప్రణాళిక, అభివృద్ధి కమిటీ (సిపిడిసి) ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. కళాశాల స్థాపించిన దగ్గర నుంచి నేటి వరకూ పర్మినెంట్ ప్రిన్సిపల్ పోస్ట్ లేకపోవడం కళాశాలకు తీరని లోటుగా ఉండేదన్నారు. ప్రస్తుతం పోస్టు మంజూరు కావడంతో సిపిడిసి కమిటీ సెక్రటరీ సీతారామాంజనేయరాజు, లయన్ ఈపూరి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, సాగిరాజు జానకిరామరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వేశ్వరరావు, కో ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి తదితరులు కమిషనర్‌ను కలిసి కళాశాల తరపున అభినందనలు తెలిపారు.

పేదలకు బియ్యం, పండ్లు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో 50 మంది పేదలకు బియ్యం, పండ్లు గురువారం అందించారు. ఏలూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ సంకల్పం సేవా ట్రస్ట్ సభ్యులు రుద్రరాజు హరి రాజు, నంబూరి సత్యకృష్ణ వర్మ ఈ కార్యక్రమానికి రూ.26 వేలు అందించారని నిర్వాహకులు తెలిపారు.

తారకరత్న మృతికి సంతాపం

ప్రజాశక్తి - భీమడోలు

సినీ నటులు నందమూరి తారకరత్న దశదిన కార్యక్రమాన్ని భీమడోలులో గన్నియాత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి ప్రముఖులు భీమవరానికి చెందిన తోట సీతారామలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.